పన్ను వసూళ్లకు మెప్మా సిబ్బంది

- అదనంగా మరో 40 (హెచ్‌హెచ్‌డీ) మిషన్ల కోసం ప్రతిపాదనలు
- వేగంగా వసూళ్ల కోసం బల్దియా అధికార యంత్రాంగం చర్యలు



ముస్సిపల్ కార్యాలయం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రావాల్సిన పన్నుల కోసం అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ఈ సంవత్సరం రావాల్సిన పన్నులు, పాత బకాయిలు, జరిమానాలు, నీటి పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టిసారించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 20 రోజుల సమయం మాత్రమే మిగిలివుంది. దీంతో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. రెవెన్యూ సిబ్బందితోపాటు తాను కూడా రోడ్డుబాట పట్టారు. దుకాణాలు తిరుగుతూ పన్నులు చెల్లించాలని సూచిస్తున్నారు. మొండి బకాయిదారులపై కొరడా ఝులిపిస్తున్నారు.

ఇప్పటివరకు రూ.30 కోట్లు వసూలు..

పన్నుల రూపేనా బల్దియాకు దాదాపు రూ.90 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ. 29.80 కోట్లు వసూలు చేశారు. కేవలం వారం రోజుల్లోనే రూ.4 కోట్ల వరకు వసూలు చేశారు. మరో 10 రోజుల వ్యవధిలో రూ. 15 కోట్ల వరకు పన్నులు వసూలు చేయాలని అధికారులు లక్ష్యం నిర్దేశించారు. ఆదివారం, రెండో శనివారం, ఇతర సెలవు దినాల్లో సైతం సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 80 మంది వరకు సిబ్బంది పన్ను వసూళ్ల విధుల్లో ఉన్నారు.

వీరితోపాటు తాజాగా మెప్మా విభాగానికి చెందిన సిబ్బంది సేవలు సైతం వినియోగించనున్నారు. వీరిలో బల్దియాలో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, 8 మంది సీవోలున్నారు. నగరంలో ఆర్‌పీలు (రిసోర్సు పర్సన్‌లు) 200 మంది వరకు ఉన్నారు. బిల్ కలెక్టర్లతోపాటు ఆర్పీలు, సీవోల సహాయంతో పన్నులు వసూలుచేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. ఈమేరకు వారితో ప్రత్యేక సమావేశం సైతం నిర్వహించారు.

సరిపోని మిషన్లు..

పన్నుల వసూళ్ల కోసం బల్దియా అధికారులు హ్యాండ్ హెల్డు డివైజ్ (హెచ్‌హెచ్‌డీ) మిషన్లను వాడుతున్నారు. ఈ మిషన్లు బిల్లు కలెక్టర్ల ఆధీనంలో ఉంటాయి. బల్దియాలో ఇప్పటివరకు 38 మిషన్లు మాత్రమే ఉన్నాయి. నగరంలో 60 డివిజన్లు ఉండగా, మరో 40 మిషన్ల కోసం కమిషనర్ సీడీఎంఏకు సమాచారం ఇచ్చారు. దాంతో యాక్సిస్ బ్యాంక్ వారు 40 మిషన్లు ఇచ్చేందుకు అంగీకరించారు. ఈనేపథ్యంలో మంగళవారం నుంచి పన్ను వసూళ్లు వేగవంతం కానున్నాయి. మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ నేరుగా పన్నుల వసూళ్లలో నేరుగా పాల్గొంటున్నారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి వారి వెంట పన్నుల వసూళ్లకు వెళుతున్నారు. పన్నులు చెల్లించనివారి దుకాణాలు సీజ్ చేస్తున్నారు. ఇప్పటివరకు 15 దుకాణాలు సీజ్‌చేశారు. చెల్లించాల్సిన పన్నులకు సంబంధించిన సొమ్ము బిల్ కలెక్టర్‌కు నేరుగా చెల్లించి రసీదు పొందాలి. బల్దియా కార్యాలయంలో, మీసేవా కేంద్రాల్లో, ఆన్‌లైన్‌లో కూడా పన్నులు చెల్లించవచ్చు.

ఆర్పీలు సహకరించాలి

బల్దియా పన్నుల వసూళ్ల కోసం మెప్మా సిబ్బంది సహకారం కూడా తీసుకుంటున్నాం. నగరంలోని ఆర్పీలు క్షేత్రస్థాయిలో సహకరించాలి. వారి సహకారంతో పన్నుల వసూళ్లు వేగవంతం అవుతాయి. బల్దియాకు చెల్లించాల్సిన పన్నులను నగరవాసులు వెంటనే చెల్లించాలి.

–దిలీప్‌కుమార్,
మున్సిపల్ కమిషనర్, నిజామాబాద్

అవగాహన కల్పించాలి

నిజామాబాద్ బల్దియాలో పన్నుల వసూళ్ల కోసం మెప్మా సిబ్బందిని కమిషనర్ భాగస్వామ్యం చేశారు. క్షేత్రస్థాయిలో బిల్ కలెక్టర్లకు ఆర్పీలు సహకరించాలి. ఆయా డివిజన్లలో తెలిసినవారికి పన్నులు చెల్లించేలా ఆర్పీలు అవగాహన కల్పించాలి. పన్ను వసూళ్లకు పూర్తి సహకారం అందించాలి.

–చిదుర రమేష్,
మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్

క్లుప్తంగా

పరీక్షలంటే భయం వద్దు



మాట్లాడుతున్న గంగాప్రసాద్

సిరికొండ: విద్యార్థులు పరీక్షల పట్ల భయం పెట్టుకోవద్దని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్ కోటగిరి గంగాప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సోమవారం ఆయన తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఒత్తిడిని అధిగమించి పరీక్షలను ఎలా రాయాలి, సమయాన్ని ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలి, పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలో వివరించారు. హెచ్ఎం గడ్డం రాజేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ ఏర్పాటు



నూతన బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

నిజామాబాద్ రూరల్: రూరల్ మండల పరిధిలోని సారంగాపూర్ సబ్ స్టేషన్‌లో రూ.10 లక్షల వ్యయంతో నూతన బ్రేకర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు అమర్చారు. సోమవారం వారు బ్రేకర్‌ను ప్రారంభించారు. వచ్చే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు నూతనంగా బ్రేకర్‌ను అమర్చినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. డీఈ ఉత్తమ్ జాడే, ఏడీఏ బాలేష్ కుమార్, ఏఈ శ్రీనివాస్, విద్యుత్ అధికారులు సంజీవ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, హరిచంద్, రాంసింగ్, అక్బర్ నావాజుద్దీన్, అప్సర్, గూలాబ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలకృష్ణ

ధర్పల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. మండలంలోని వాడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యత గల వంట సామగ్రిని వాడాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు భోజనంలో కోడిగుడ్లు ఎందుకు పెట్టడం లేదని నిర్వాహకులను ప్రశ్నించారు. బర్డ్‌ఫ్లూ వచ్చినప్పటి నుంచి గుడ్లు ఇవ్వడం లేదని హెచ్ఎం సమాధానం ఇచ్చారు. అనంతరం హొన్నాజీపేట్ గ్రామంలోని నర్సరీ, ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. వేసవి దృశ్య నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పట్టించాలని సిబ్బందికి సూచించారు.

అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

నిజామాబాద్ నాగారం: ప్రత్యేక తెలంగాణ కోసం చనిపోయిన అమరుల కుటుంబాలకు, జైలుకు వెళ్లిన ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని జేఏసీ కన్వీనర్ గైని గంగారాం అన్నారు. వినాయక్‌నగర్‌లోగల అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ఆయన అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అన్ని పార్టీలు ఇప్పటివరకు తెలంగాణ కోసం చనిపోయిన కుటుంబాలకు, జైలుకు వెళ్లిన ఉద్యోగులకు న్యాయం చేయడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన తెలంగాణ కోసం త్యాగంచేసిన కుటుంబాలకు ఆదుకోవాలని కోరారు. నాయకులు భాస్కర్, మోహన్, రాజారాం, సంతోష్, లక్ష్మన్, సక్కి విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

అనుమతిలేని బడులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: అనుమతి లేకుండ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రయివేటు బడులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని ఓ ప్రయివేటు పాఠశాల ఎదుట సోమవారం వారు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రఘురాం, ఓమయ్య, రంజిత్, అంజలి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిజామాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మోపాల్ మండలం తాడెం గ్రామంలో నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అలాగే మాధవ్‌నగర్ బోర్గం(పి), పాంగ్రా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆర్యనగర్‌లోని రామాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రూరల్ మండల పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చేస్తానని, గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజల సేవకోసం తన వైద్య వృత్తిని సైతం పక్కకు పెట్టినట్లు వివరించారు. నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, సీనియర్ నాయకులు నందగిరి భూమారెడ్డి, గడ్కోల భాస్కర్‌రెడ్డి, సూర్యరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌లు, చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పైస ఎల్లయ్య, సాయారెడ్డి, బోర్గం శ్రీను, చిలుక సాయిలు, గంగాప్రసాద్, రఘు, ఎల్ఐసీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి: మల్లాపూర్‌లో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, నాయకులు సంతోష్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ఎంపీ అర్వింద్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి న్యాలం రాజు అన్నారు. జిల్లా అభివృద్ధిని అడ్డుకుంటున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రజలకు క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చిన ఎంపీ అర్వింద్ మాట ప్రకారం పసుపు బోర్డు ఏర్పాటు చేశారని, కేంద్ర కార్యాలయాన్ని కూడా జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయించారన్నారు. జిల్లాలో సుదర్శన్‌రెడ్డి శకుని పాత్ర పోషిస్తూ, శనిలా మారారని, ఆయనకు భజన బ్యాచ్ సభ్యులైన కొందరు ఎంపీ అర్వింద్‌పై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. అర్వింద్‌పై అసత్య ప్రచారాలు చేస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, రాగి నారాయణ యాదవ్, సుధాకర్ చారి, ఇప్పకాయల కిషోర్, బాల్‌రాజ్, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నియామకాలు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలు అక్రమ పద్ధతుల్లో జరిగాయని, వెంటనే వాటిని రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నూతనంగా నోటిఫికేషన్ విడుదల చేసి నియమనిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టాలన్నారు. ఈమేరకు సోమవారం తెలంగాణ యూనివర్సిటీ వీసీ చాంబర్ ఎదుట పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో ఇచ్చిన గెస్ట్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్ డిపార్ట్‌మెంట్ నోటీస్ బోర్డు మీద తప్ప పత్రిక ప్రకటన ఇవ్వకుండా గోప్యంగా ఉంచారన్నారు. మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేలా నియామకాలను చేపట్టాలన్నారు. నాయకులు నరేందర్, కర్క గణేష్, రఘురాం, శివ, చరణ్, రాజు, సంజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాలకు సమప్రాధాన్యం



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాల వారిని ప్రోత్సహించేవిధంగా సమానమైన ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా కాంగ్రెస్ ఎస్టీసెల్ చైర్మన్ కెతావత్ యాదగిరి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిర్ణయించడంలో ఏఐసీసీ పెద్దలు సమ న్యాయం చేశారన్నారు. పార్టీలో ముందునుంచి ఉన్నవారు, కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని కష్టనష్టాలను భరించి పార్టీ కోసం పనిచేసినవారికి గుర్తింపు ఉంటుందని మరోసారి నిరూపించారన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి పదవులు దక్కుతాయనేందుకు శంకర్ నాయక్ ఎంపిక నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో ఉత్తర తెలంగాణ గిరిజనులకు పార్టీలో ఉన్నత పదవులు కల్పించాలని కోరారు. పార్టీ అగ్రనేతలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నాయకులు బున్నె రవీందర్ ఉన్నారు.

దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కళ్లద్దాలు అందిస్తాం



విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లాలో దృష్టిలోపం ఉన్న విద్యార్థులందరికీ ప్రభుత్వం కంటి అద్దాలను పంపిణీ చేస్తోందని జిల్లా వైద్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) రాజశ్రీ తెలిపారు. మండలంలోని కంజర్ సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయంలో సోమవారం ఆమె విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల విద్యార్థులకు వైద్య సిబ్బంది కంటి పరీక్షలను నిర్వహించిందని, దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తుందన్నారు. అందులోభాగంగా మొదటి విడతలో 1277 కళ్లద్దాలు జిల్లాకు వచ్చాయన్నారు. జిల్లావ్యాప్తంగా ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా వాటిని పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి అశోక్, ప్రిన్సిపాల్ విజయ, మేనేజర్ సచిన్, డాక్టర్ మాధవి, సందీప్, కరీం, సంధ్య, నర్సవ్వ, రఘుపతి, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నిజామాబాద్‌రూరల్: రూరల్ నియోజకవర్గంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్ధిదారులకు మంగళవారం ఉదయం రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేతుల మీదుగా చెక్కులను అందించనున్నట్లు వారు తెలిపారు.

'నవోదయ'పై రాజకీయాలు తగవు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో నవోదయ విద్యాలయం ఏర్పాటుపై అధికార కాంగ్రెస్, బీజేపీ రాజకీయాలు చేయడం సరికాదని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ అన్నారు. నగరంలోని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు వచ్చిన నవోదయ పాఠశాలను కాంగ్రెస్, బీజేపీ సమన్వయంతో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రతినిధులు దీపిక, దినేష్, ఆజాద్, చక్రి, రాజు, వీణ ఉన్నారు.

బోధన్ డీఎల్‌పీవోగా నాగరాజు బాధ్యతల స్వీకరణ

బోధన్: బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారిగా ఎస్.నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాన్సువాడలో పనిచేసిన నాగరాజును బోధన్‌కు బదిలీ చేస్తూ ఇటీవల అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

బోధన్‌లో సబ్‌కలెక్టర్ పర్యటన



బోధన్‌టౌన్ : పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో పర్యటించారు. పట్టణంలోని 5,9,35 వార్డుల్లో కాలువపై గల ఉన్న కల్వర్టులు అధ్వానంగా మారడంతో వాటిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. కల్వర్టుల నిర్మాణం మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. డీఈ యోగేష్, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి





సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాలమహానాడు నాయకులు.. సిరికొండలో..

నిజామాబాద్ నాగారం: నగరంలోని మాల మహానాడు జిల్లా కార్యాలయంలో సోమవారం సావిత్రిబాయిపూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు సక్కి విజయ్‌కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరడి లక్ష్మణ్, నాయకులు చంద్రశేఖర్, విజయ, ప్రభంజన్, రాజు, సంతోష్, సునీత, లావణ్య, మంజుల, పుష్ప, గంగవ్వ, రమ్య, విమల పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో సావిత్రిబాయిపూలే వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ నర్సయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్‌లో 4 దుకాణాలు సీజ్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో ఆస్తి పన్ను చెల్లించని నాలుగు దుకాణాలను సోమవారం బల్దియా అధికారులు తాళం వేసి సీజ్ చేశారు. బకాయి ఉన్న దుకాణాల్లో బల్దియా అధికారులు పన్ను వసూలు చేస్తున్నారు. అనిల్ టాకీస్ రోడ్డులో రెండు దుకాణాలతో పాటు మరో రెండు దుకాణాలను అధికారులు సీజ్ చేశారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,300	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	81,492	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	50	70	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	50	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	50	70
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఛావా(తెలుగు)-11.00.4.40.10.30 ఛావా(హిందీ)-1.45, 7.40
స్క్రీన్-2	సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-1.30, 7.30 నారి(తెలుగు)-4.40 రా.. రాజా(తెలుగు)-10.30
స్క్రీన్-3	జిగేల్(తెలుగు)-11.00 కింగ్స్టన్(తెలుగు)-1.30, 7.30 రిటర్న్ ఆఫ్ డ్రాగన్(తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(తెలుగు)-10.00 కింగ్స్టన్(తెలుగు)-1.20, 7.40 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-4.20, 10.40
స్క్రీన్-2	సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-10.15 ఛావా(హిందీ)-1.30, 10.50 సివంగి(తెలుగు)-4.50 ఛావా(తెలుగు)-7.30
స్క్రీన్-3	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.25 ఛావా(తెలుగు)-1.35 మిక్కీ-17(ఇంగ్లీష్)-4.55, 7.50 కింగ్స్టన్(తెలుగు)-10.45
స్క్రీన్-4	నారి(తెలుగు)-10.35 మిక్కీ-17(ఇంగ్లీష్)-1.10. జాబిలమ్మ నీకు అంత కోపమా (తెలుగు)-1.30 సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-4.05, 10.30 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.20
లలితామహల్	సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు
దేవి	మజాకా(తెలుగు)
నటరాజ్	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్
విజయ్	ఛావా (తెలుగు)

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



రాణాకలాన్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎడపల్లి(బోధన్): వేసవిలో డిమాండ్ దృష్ట్యా వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని బోధన్ డీఈ ముక్తార్ కోరారు. మండలంలోని రాణాకలాన్ గ్రామంలో సోమవారం విద్యుత్ వినియోగ దారులకు, రైతులకు విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించడానికి పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడీఈ ప్రభాకర్, సిబ్బందితో కలిసి ఆయన గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈ కిశోర్ రెడ్డి, సిబ్బంది శంకర్ నాయక్, గంగయ్య, హైమద్ పాష, గజానంద్, అశోక్, శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

రుద్రూర్ : మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. సోమవారం ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి భీమ్‌రావ్, మండల పంచాయతీ అధికారి గంగాధర్, రాణంపల్లి, అంబం (ఆర్)ు జీపీ కార్యదర్శులు శ్రావణ్, మోహన్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముల్లంగి గ్రామంలో..

మాక్లూర్: మండలంలోని ముల్లంగి గ్రామంలో సోమవారం గృహనిర్మాణాధికారి ప్రభు, ఏఈ సత్యనారాయణ లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు రామా గౌడ్, రాజేష్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



నిజామాబాద్ రూరల్: నగరంలోని ఎల్లమ్మగుట్ట మున్నూరుకాపు సంఘంలో సోమవారం గంగారాం మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, ఎస్ఈ రవీందర్, నార్త్ తహసీల్దార్ నాగరాజు, సరళ, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

బాధితుడికి పరామర్శ

నిజామాబాద్‌అర్బన్: బీఆర్‌ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు త్యాగస్వామి ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో సోమవారం అతడిని తెలంగాణ ఉద్యమకారులు కోనేరుసాయికుమార్, ఈర్లశేఖర్, ప్రవీణ్‌లు పరామర్శించారు.